క్లుప్తంగా

ఘనంగా మొల్లమాంబ జయంతి

బనగానపల్లెరూరల్: మహా కవయిత్రి అతకూరి మొల్లమాంబ జయంతి కార్యక్రమాన్ని నియోజకవర్గ శాలివాహన సంక్షేమ సంఘం అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నాగులకట్ట వీధిలోని రామాలయంలో జరిగిన కార్యక్రమంలో సురేష్ మాట్లాడుతూ మహాకవి వాల్మీకి మహర్షి సంస్కృతంలో రచించిన రామాయణ మహాకావ్యాన్ని తెలుగు వారికి అర్థమగు రీతిలో తెలుగుతో మొల్లమాంబ లభించారని కొనియాడారు. రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక జీఓ విడుదల చేసి ప్రభుత్వమే మొల్లమాంబ జయంతి కార్యక్రమం నిర్వహించేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. సురేష్ శాలివాహన సంఘం మహిళతో కలిసి కేక్‌కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుమ్మరి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి శివరామ మద్దిలేటి, నాయకులు నాయకులు, రవి, శివరామకృష్ణ, మహేష్, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరస్వామికి వెండి కలశం బహూకరణ



అర్చకుడికి వెండి కలశం, మంగళ సూత్రాన్ని అందజేస్తున్న జ్యోతి శ్రవణ్ దంపతులు

బనగానపల్లెరూరల్: మండలంలోని పలుకూరు గ్రామంలో వెలసిన శ్రీ రామేశ్వరస్వామికి మిడుతూరు మండలం ఉప్పలదడియ గ్రామానికి చెందిన జ్యోతి, శ్రవణ్ దంపతులు సుమారు 11 తులాల వెండి కలశంతో పాటు మంగళ సూత్రాన్ని బహూకరించారు. సోమవారం వీటిని ఆలయ అర్చకులు భాస్కరయ్య అందజేశారు. పలుకూరు గ్రామానికి చెందిన ఫోటో స్టూడియో రాజు కూతురు జ్యోతి, అల్లుడు శ్రవణ్ స్వామిపై భక్తితో వీటిని సమర్పించినట్లు అర్చకుడు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు చల్లా మద్దిలేటి ఉన్నారు.

శరవేగంగా రహదారి విస్తరణ పనులు



బేతంచెర్ల పట్టణంలో రహదారి పనులు జరుగుతున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని అయ్యలచెర్వు నుంచి కస్తూరిబా గాంధీ గురుకుల విద్యాలయం వరకు జరుగుతున్న నాలుగులైన్ల రహదారి విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం రహదారితో పాటు బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.రహదారి పనులు పూర్తయితే పట్టణ ప్రజలతో పాటు వాహనదారులకు సౌకర్యంగా మారనుంది.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

బనగానపల్లెరూరల్: బనగానపల్లె పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రామలక్ష్మి సోమవారం తెలిపారు.ఈ నెల 11న డోన్ పట్టణంలో జరిగిన జిల్లా స్థాయి కరాటే పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ఆరోతరగతి విద్యార్థి బాలాజీ నాయక్, ఏడో తరగతి విద్యార్థులు సాయిరామ్ నాయక్, మహేంద్ర పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

మధుసూదన్‌రెడ్డి విజయం తథ్యం



ఓటు హక్కును వినియోగించుకుంటున్న గోపాల్‌రెడ్డి

డోన్ టౌన్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్‌రెడ్డి విజయం తథ్యమని ఎంపీడీసీల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అన్నవరం ఎంపీటీసీ గోపవరం గోపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం డోన్ పట్టణంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. వెయ్యి ఓట్ల మెజార్టీతో మధుసూదనరెడ్డి గెలుపును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కానుకగా ఇస్తామన్నారు.



బేతంచెర్లలో వికలాంగులు ఓటు వేయడానికి వస్తున్న దృశ్యం



ఓటు హక్కు వినియోగించుకున్న డోన్ ఎంపీపీ రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ రాజేష్



డోన్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న ఆర్‌డీఓ వెంకటరెడ్డి



అవుకులో ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్న జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి



డోన్‌లో ఇతరుల సహాయంతో ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధ పట్టభద్రురాలు

ఉత్సాహం చూపిన ఓటర్లు

- ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం
- ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోటెత్తిన గ్రామీణ పట్టభద్రులు
- డోన్ డివిజన్ పరిధిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 85.86 శాతం పోలింగ్ నమోదు
- స్థానిక సంస్థలకు పోలైన ఓట్లు 90 శాతం, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 80 శాతం
- డోన్‌లో టీడీపీ నాయకుల ఓవరాక్షన్
- డీఎస్పీ జోక్యంతో సద్దుమణిగిన వైనం



సంజామలలో ఓటు వేసేందుకు క్యూలో నిలుచున్న పట్టభద్రులు

డోన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ స్థానాలకు సోమవారం జరిగిన పోలింగ్ డివిజన్ వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మొదట మందకొడిగా సాగినా, మధ్యాహ్నం 2 గంటలకు వేగం పుంజుకుంది. ముఖ్యంగా పట్టభద్రులు పెద్దసంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి రావడంతో డోన్‌లోని 303 పోలింగ్ కేంద్రం వద్ద భారీ సంఖ్యలో పట్టభద్రులు కనిపించారు. డోన్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 85.86 శాతం, స్థానిక సంస్థలకు 90 శాతం, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 80 శాతం ఓట్లు పోలయ్యాయి. కాగా పట్టణంలో పట్టభద్రుల స్థానానికి ఓట్లు 80 శాతం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ 85.05 శాతం, స్థానిక సంస్థలకు 85.70 శాతం పోలింగ్ నమోదయ్యింది.

303 పోలింగ్ కేంద్రంలో విపరీతమైన రద్దీ

303 పోలింగ్ కేంద్రానికి మండలంలోని 46 గ్రామాల ఓటర్లు భారీ సంఖ్యలో చేరుకోవడంతో పోలింగ్ కేంద్రం వద్ద విపరీతమైన రద్దీ ఏర్పడి తోపులాట జరిగింది. పోలింగ్ సమయం ముగిసినా కూడా ఓటర్లు



డోన్‌లో డీఎస్పీతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ నేతలు

క్యూలో భారీగా ఉండటంతో టోకన్లు జారీచేసి పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు. పోలింగ్ గడువు ముగిసిన తర్వాత ఏ ఒక్కరిని కూడా పోలింగ్ కేంద్రంలోకి పోలీసులు అనుమతించలేదు. ఈ పోలింగ్ కేంద్రంలో 1345 మంది పట్టబద్రులైన ఓటర్లు ఉండగా ఇందులో 1018 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కేంద్రంలో ఓటర్ల అసహనాన్ని అర్థం చేసుకొన్న ఆర్డీఓ వెంకటరెడ్డి అదనపు సిబ్బందిని నియమించి ఓటింగ్ త్వరగా పూర్తి అయ్యేందుకు చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా రాత్రి 7 గంటల వరకు పోలింగ్ సాగింది.

టీడీపీ నాయకుల వాగ్వాదం

ఓటింగ్ సరళితో ఓటమి తప్పదని భావించిన టీడీపీ నేతలు పోలింగ్ సమయం ముగుస్తున్న సందర్భంలో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలింగ్ కేంద్రాల్లోని తమ ఏజెంట్లు అమాయకులని అధికార పార్టీ వారు అది అదునుగా భావించి సైక్లింగ్ చేస్తున్నారని అర్థం లేని ఆరోపణలు చేయడంతో డీఎస్పీ శ్రీనివాసరెడ్డి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి ప్రశాంతంగా ఎన్నిక జరిగేందుకు సహకరించి చివర్లో శాంతి భద్రతలకు భంగం కలిగించేందుకు యత్నిస్తే సహించమని తీవ్రస్థాయిలో హెచ్చరించడంతో అక్కడి నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు వెళ్లిపోయారు.

ఓటుకు..తరలివచ్చిన పట్టభద్రులు

కొలిమిగుండ్ల: మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి 82.66 శాతం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 89.39 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారని ఎలక్ట్రోల్ ఆఫీసర్ సునీల్‌రెడ్డి చెప్పారు. పోలింగ్ సమయం 4గంటలకు ముగిసినా 90 మందికి పైగానే ఓటర్లు క్యూలైన్‌లో ఉండటంతో వారందరికి స్లిప్‌లు అందజేసి ఓటు వేసేలా చర్యలు తీసుకున్నారు. స్థానిక పోలింగ్ కేంద్రంలో జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సరస్వతి దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

అవుకు మండలంలో..

అవుకు: మండలంలో 1,097 పట్టభద్రుల ఓట్లకుగాను 859 మంది తమ ఓటును సద్వినియోగం చేసుకోవటంతో 78.30 శాతం పోల్ అయ్యిందని, అలాగే 54 ఉపాధ్యాయ ఓట్లు ఉండగా 54 మంది తమ ఓటును వినియోగించుకోవటంతో 100శాతం పోల్ జరిగిందని సెక్టోరల్ అధికారి ఉమాకాంత్ రెడ్డి వెల్లడించారు. ప్రజలతో పాటు తమ ఓటు హక్కును వినియోగించుకోవటానికి అవుకు మండల జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ, అవుకు మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు చల్లా ప్రభాకర్ రెడ్డి తదితరులు తరలి వచ్చారు.

సంజామలలో 81 శాతం పట్టభద్రుల పోలింగ్

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో 1,022 మందికి 826 మంది పట్టభద్రులు ఓటు వేసి 81శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 47కు 44 మంది ఓట్లు వేయడంతో 93.6 శాతం పోలింగ్ నమోదైంది. తహసీల్దార్ మల్లికార్జునరావు, ఎంపీడీఓ విజయ్‌కుమార్‌డ్డి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

బేతంచెర్ల మండలంలో..



బేతంచెర్లలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బేతంచెర్ల: పట్టణంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ 97 శాతం, పట్ట భద్రుల స్థానానికి 83 శాతం నమోదైనట్లు తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎంపీయూపీ పోలింగ్ కేంద్రాన్ని నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డోన్ ఆర్డీఓ వెంకట రెడ్డి పరిశీలించారు.

భారీ స్థాయిలో ఓటింగ్ నమోదు

బనగానపల్లె: బనగానపల్లె నియోజకవర్గంలో పట్టభద్రుల,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకుగాను భారీ స్థాయిలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటర్లు 7,774 మంది ఉండగా 6,632, ఉపాధ్యాయ ఓటర్లు 710 ఉండగా 677 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. డోన్ ఆర్డీఓ వెంకటరెడ్డి, జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డిలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

ప్యాపిలిలో ఉపాధ్యాయ స్థానానికి వందశాతం పోలింగ్

ప్యాపిలి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 25 మంది ఉపాధ్యాయులకుగాను 25 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ చంద్రశేఖర వర్మ తెలిపారు. అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి మండలంలో మొత్తం 83 శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు.ప్యాపిలి బాలుర ఉన్నత పాఠశాలలో సాయంత్రం 4 గంటలలోగా పోలింగ్ కేంద్రంలో ఉన్న ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పించడంతో 5.30 వరకు పోలింగ్ కొనసాగింది.



ప్యాపిలిలో ఓటు వేసిన దివ్యాంగుడు

నూనె గింజల సాగుపై ఆసక్తి చూపాలి

బనగానపల్లెరూరల్: రైతులు నూనె గింజల సాగుపై ఆసక్తి చూపించాలని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అయిల్ సీడ్స్ రిసెర్చ్ (ఐఐఓఆర్)సీనియర్ శాస్త్ర వే త్త, నోడల్ ఆఫీసర్ డాక్టర్ జె.జవహర్‌లాల్ సూచించారు. సోమవారం మండలంలోని యాగంటిపల్లె స కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో శ్రీ హనుమంతరా య ఎడ్యూకేషనల్ అండ్ చారిటబుల్ సొసైటి సెక్రటరీ పెండేకంటి బాలాజీ అధ్యక్షతన ఆముదం పంటపై క్షేత్ర దినోత్సవం కార్యక్రమం జరిగింది. డాక్టర్ జవహర్‌లాల్ మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో అయిల్ ధరలు బాగా పెరుగుతున్నాయన్నారు. నూనె గింజ పంటలైన ఆముదం, కుసుమ, పొద్దుతిరుగుడు, తెల్ల కుసుమలు వంటి పంటలకు మంచి గిట్టుబాటు ధర లభిస్తోందన్నారు. ఈ పంటలు సా గు చేయు రైతులకు పెట్టుబడి ఖర్చులు తక్కువగా వస్తాయని, చీడపీడలు కూడా పెద్దగా ఆశించవని చెప్పారు. మరో శాస్త్రవేత్త డాక్టర్ సురేష్ నూనె గింజల పంటల్లో అధిక దిగుబడులు సాధించాలంటే తీసుకోవాల్సిన మెలకువలను వివరించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ మంజునాథ్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ లావణ్య నూనెగింజల పంట సాగులో సస్యరక్షణ పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఆముదం పంటను క్షేత్రస్థాయిలో శాస్త్రవేత్తలు పరిశీలించి పంటల సాగులో తీసుకోవాల్సిన మెలకువలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో కేవీకే ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మీ, ఏఓ సురేష్ కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు రమణయ్య, బాలరాజు, ఆదినారాయణ, రవిగౌడ్, లక్ష్మీప్రియ వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఐఓఆర్ సీనియర్ శాస్త్రవేత్త, నోడల్ ఆఫీసర్ డాక్టర్ జె జవహర్‌లాల్

ఓటు హక్కుపై అవగాహన పెరిగింది

అవుకు: ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన పెరిగిందని అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి, అవుకు సొసైటీ అధ్యక్షుడు చల్లా విజయభాస్కర్ రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. సోమవారం అవుకు మండలంలో జరిగిన ఎమ్మెల్సీ పోలింగ్ నేపథ్యంలో వారు మాట్లాడుతూ గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ఓటర్లకు అవగాహన సరిగా లేక ఓటు వినియోగం తక్కువగా ఉండేదన్నారు. అయితే ప్రస్తుతం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందు పట్టభద్రులకు మండలంలోని సచివాలయ కన్వీనర్, గృహసారథులు ఇంటింటికి తిరిగి ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారన్నారు. దీంతో గతంలో ఎన్నడులేని విధంగా పట్టభద్రులు తమ ఓటును వినియోగించుకున్నారని తెలిపారు.

4న చాగంటి కోటేశ్వరరావు నంద్యాలకు రాక

నంద్యాల(వ్యవసాయం): ఆధ్యాత్మిక వేత్త, ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు ఏప్రిల్ 4న నంద్యాలకు రానున్నట్లు మన ఊరు–మనగుడి, మన బాధ్యత నిర్వాహకులు శివకుమార్‌రెడ్డి, రాంప్రసాద్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక సందేశం ఇవ్వడానికి రానున్నారని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సాధనతో క్రీడల్లో రాణింపు

కర్నూలు(టౌన్): క్రీడల్లో నిత్య సాధన ద్వారా రాణించగలుగుతారని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు బి.రామాంజనేయులు అన్నారు. రెండు రోజులుగా స్థానిక యూనైటెడ్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న జిల్లా స్థాయి ఓపెన్ తైక్వాండో పోటీలు సోమవారం ముగిశాయి. పోటీల్లో విజేతలకు ఆయన మెడల్స్ అందజేసి మాట్లాడారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించే క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.

నేడు డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు నేడు డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కర్నూలు, నంద్యాల జిల్లాల వినియోగదారులు సెల్: 7382614308 నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలు తెలియజేసి పరిష్కారం పొందాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపు నల్లేరు మీద నడకే

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిల గెలుపు నల్లేరుమీద నడకేని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. పట్టణంలోని కస్బా ఎంపీపీ పాఠశాలలోని 350వ పోలింగ్ కేంద్రంలో సోమవారం ఎమ్మెల్యే కాటసాని పట్టభద్రుల ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం ప్రారంభంలోనే ఖరారైందన్నారు. మెజార్టీయే ముఖ్యమన్నారు. ఈ విషయం ఇతర పార్టీల వారికి కూడ తెలుసన్నారు. సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న ప్రజాసంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీకి శ్రీరామరక్ష అన్నారు. త్వరలోనే సీఎం వైఎస్ జగన్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల సమస్యలు పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన సంఘం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, కైప ప్రతాప్ రెడ్డి, అంబటి రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బనగానపల్లెలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

మదరసా నిర్మాణ పనులు ప్రారంభం



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పట్టణంలోని కొండపేటలో ఓల్డ్ మదరసాకు సంబంధించి మదరసా–ఏ నూరుల్ ఇస్లాం నిర్మాణానికి సోమవారం ముస్లిం మత గురువుల ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి మజీద్, మదరసాకు పునాదులు వేశారు. అనంతరం ఖురానే హాఫీజ్ సర్టిఫికెట్లను అర్హత పొందిన వారికి అందజేశారు.

నేడు విద్యుత్ కోతలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని వాటర్ వర్క్స్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వైఎస్ నగర్, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి నగర్, టీచర్స్ కాలనీ, తారకరామనగర్, ఆర్టీసీ కాలనీ, సుందర్‌సింగ్‌కాలనీల తో పాటు మల్లెంపల్లె, లక్ష్మంపల్లె, బొంతిరాళ్ల గ్రామాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వైభవంగా ఉమామహేశ్వరుడి కల్యాణం



యాగంటిలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె: యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు, ఆయన వియ్యంకులు పెద్దిసాయిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులచే రుద్రహోమం, లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చన తదితర పూజలు జరిగాయి. సాయంత్రం కల్యాణం అనంతరం పల్లకీ సేవ జరిగింది. కార్యక్రమంలో కాటసాని ఓబులరెడ్డి, ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డోన్‌లో వేంకటేశ్వరుడి కల్యాణోత్సవ దృశ్యం

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

డోన్ టౌన్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో వెలసిన శ్రీగోదాదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. దేవాలయం నిర్మించి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గత మూడు రోజులుగా జరుగుతున్న రజతోత్సం, వార్షిక బ్రహ్మోత్సావాల్లో భాగంగా సోమవారం ఆలయం ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం జరిపించారు.

సుంకేసులకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసులకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం ఎగువ నుంచి 1,050 క్యూసెక్కుల నీరు వచ్చి చేరగా కేసీ కాల్వకు 505 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాంలో ప్రస్తుతం 0.782 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సవరణ

11-03-2023 సాక్షి దినపత్రికలో ప్రచురించిన సర్వే నెంబరు 1113/1997 గా పేరు కాలింగిరి @ కొట్టం మురళీకృష్ణగా సవరించడమైనది.


ఇట్లు కాలింగిరి @ కొట్టం మురళీకృష్ణ తండ్రి పెద్ద వీరన్న, ఇంటి నెం. 10-269/11, ఇందిరా నగర్, కోవెలకుంట్ల, నంద్యాల జిల్లా.

18న వాలీ బాల్ టోర్నీ

బనగానపల్లెరూరల్: కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కాటసాని ఓబులరెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుంచి రాష్ట్ర స్థా యి ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు సోమవారం తెలిపారు. పోటీల్లో విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ. 20వేలు, రూ.10వేలు నగదు బహుమతులను అందజేస్తా మన్నారు. ఈ నెల 16వ తేది లోపు 9885569450 నంబరుకు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.



ఆకుమల్ల- సుంకేసుల రహదారి దుస్థితి



అన్ని హంగులతో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు

రాచ'బాటలు'

కోవెలకుంట్ల: ఏళ్ల తరబడి శిథిలావస్థకు చేరుకున్న గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టుకుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసింది. మారుమూల గ్రామాలకు సైతం బీటీ రోడ్లతో రాచబాటలు వేసింది. కోవెలకుంట్ల ఆర్‌అండ్‌బీ డివిజన్ పరిధిలో వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు గతంలో దెబ్బతిన్నాయి. గుంతలమయంగా మారిన రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల కష్టాలను గుర్తించిన ప్రభుత్వం రూ. 7.50 కోట్లతో ఆయా రహదారులను తీర్చిదిద్దింది. సంజామల మండలం ఆకుమల్ల నుంచి అవుకు మండలం సుంకేసుల గ్రామానికి వెళ్లే రహదారి శిథిలావస్థకు చేరుకోవడంతో 14 కిమీ మేర బీటీ రోడ్డు నిర్మించారు. కొత్త రోడ్డు వేయడంతో సంజామల, అవుకు, కొలిమిగుండ్ల మండలాల్లోని వివిధ గ్రామాలకు వెళ్లేందుకు మార్గం సుగమైంది. అలాగే సుంకేసుల–చనుగొండ్ల, గులాంనబీ పేట- బొందలదిన్నె గ్రామాల రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.